ఉత్తరం కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
శనివారం 08 ఆగస్టు 2026 | సంపుటి - 01 సంచిక - 359 | పేజీలు - 6 వెల - 5

## నీళ్లపై బీఆర్ఎస్‌ది రాజకీయ డ్రామా

రాజకీయ పబ్బం గడుపుకునేందుకే హంగు ఆర్భాటాలు

నీటి విడుదలపై ముందే హంగామా చేసి క్రెడిట్ కొట్టేయాలనేది బీఆర్ఎస్ ఎత్తుగడ

: మంత్రి జూపల్లి

2లో..



# మేఘా దొంగే

**కాకతీయ రాసిన కథనాలు అక్షర సత్యాలు**

**అక్రమాలు జరిగింది వాస్తవం.. పన్నులు, జరిమానాలు కట్టింది వాస్తవం**

**ప్రభుత్వ ఖజనాకు చేరిన అక్షరాల 46లక్షలు**

**కాకతీయ వరుస కథనాలతో యంత్రాంగానికి తప్పని విచారణ**

**పరిశోధనాత్మకత సమాచారణ సేకరణతో మేఘా కుయుక్తులు వెలుగులోకి**

**కౌకొండ గుట్టల లెక్కలు... ఆర్‌టీఐతో బట్టబయలు!**

**మేఘాతో ఖజానాకు రూ.46 లక్షలు కట్టించిన కాకతీయ..!**

**కథనాల తర్వాతే వెలుగులోకి వచ్చిన ప్రభుత్వ చెల్లింపుల అధికారిక రికార్డులు**

**సమాచారం ఇవ్వొద్దని అభ్యంతరాలు...కమిషన్ ఆదేశాలతో బయటపడిన పత్రాలు**

**పర్మిట్ ఫీజు, ఎన్ఎస్ఎఫ్, ట్రస్ట్‌లకు చెల్లింపులపై స్పష్టమైన ఆధారాలు**

**అక్షర పోరాటానికి అధికారిక పత్రాలే సాక్ష్యాలుగా నిలిచిన ఘటన**

కాకతీయ, తెలంగాణ బ్యూరో : హన్మకొండ జిల్లా నడికూడ మండలంలోని కౌకొండ గుట్టల తవ్వకాలపై కాకతీయ ప్రచురించిన వరుస పరిశోధనాత్మక కథనాలు మరోసారి అక్షర సత్యాలుగా నిలిచాయి. గుట్టల తవ్వకాల అనుమతులు, ప్రభుత్వానికి రావాల్సిన పర్మిట్ ఫీజులు, రాయల్టీలు, ఇతర చెల్లింపులపై కాకతీయ లేవనెత్తిన ప్రశ్నలతో అధికార యంత్రాంగం కదిలింది. అనంతరం జరిగిన విచారణల నేపథ్యంలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ ప్రభుత్వ సంబంధిత ఖాతాలకు రూ.46,71,916 చెల్లించినట్లు అధికారిక రికార్డులు వెల్లడించాయి. ఈ వివరాలను ప్రజలకు అందకుండా నిలువరించేందుకు అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ... రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా ట్రెజరీ చలాన్లు, బ్యాంకు లేఖలు, చెల్లింపు రికార్డులు వెలుగులోకి వచ్చాయి. మైనింగ్ పర్మిట్ ఫీజు, గ్రావెల్‌పై ఎన్ఎస్ఎఫ్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్, స్టేట్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్‌లకు జరిగిన చెల్లింపులు అధికారిక పత్రాల్లో నమోదవడంతో... కౌకొండ గుట్టల తవ్వకాలపై కాకతీయ వెలుగులోకి తెచ్చిన అంశాలకు మరింత బలం చేకూరింది. ప్రజా సంపదకు సంబంధించిన లెక్కలను వెలికితీసిన కాకతీయ అక్షర పోరాటానికి ఈ అధికారిక రికార్డులే సాక్ష్యాలుగా నిలిచాయి.

.........తరువాయి 2లో




## జీఎస్టీలో ఏఐ వినియోగం

లీకేజీలకు చెక్ వివిధ శాఖల డేటాతో సమగ్ర ఏఐ వ్యవస్థ

రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంపే లక్ష్యంగా సంస్కరణలు

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో కీలక భేటీ

2లో..



## విజయ్ విడాకుల కేసుకు ముగింపు

- విజయ్ విడాకుల కేసుకు ముగింపు..
- పిటిషన్ వెనక్కి తీసుకున్న సంగీత
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరైన విజయ్ భార్య
- విచారణ కొనసాగించబోనని స్పష్టం చేసిన సంగీత
- వివరణతో ఏకీభవించిన కోర్టు.. కేసు ముగింపు

2లో..






# ఏడాది కాకతీయ

## సత్యం వైపు.. సమాజం కోసం..



ఇది ఒక వార్తాపత్రిక ప్రయాణం కాదు... ప్రజా నమ్మకానికి నిలువెత్తు సాక్ష్యం. "పత్రిక అంటే అధికారుల ప్రెస్‌నోట్లు ముద్రించే యంత్రం కాదు... అధికారాన్ని ప్రశ్నించే అద్దం." ఈ భావనతోనే 2025 ఆగస్టు 8న 'కాకతీయ' తన ప్రయాణాన్ని ప్రారంభించింది. నేటితో ఆ ప్రయాణం ఏడాది పూర్తి చేసుకుంది. సాధారణంగా ఒక కొత్త పత్రికకు మొదటి సంవత్సరం అంటే మనుగడ కోసం పోరాటం. కానీ కాకతీయకు మాత్రం మొదటి సంవత్సరం... మనుగడతో పాటు ప్రజా విశ్వాసాన్ని సంపాదించుకునే యుద్ధం. ఆ యుద్ధంలో కాకతీయ కేవలం నిలబడలేదు... తనదైన ముద్ర వేసింది. పెద్ద పెద్ద కార్పొరేట్ మీడియా సంస్థలు కోట్ల రూపాయల పెట్టుబడులతో, వందలాది మంది సిబ్బందితో పనిచేసే కాలంలో... పరిమిత వనరులతో ప్రారంభమైన ఒక ప్రాంతీయ డిజిటల్ పత్రిక ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించడం చిన్న విషయం కాదు. అది ప్రకటనల బలం వల్ల కాదు... అధికార అనుగ్రహం వల్ల కాదు... నిజాన్ని రాజీపడకుండా చెప్పాలనే సంపాదకీయ ధైర్యం వల్ల. ఈ ఏడాది కాలంలో కాకతీయ అనుసరించిన విధానం ఒకటే. ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్య... ప్రభుత్వానికి చేరాలి. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు చేరాలి. ఈ రెండింటి మధ్య వారధిగా నిలవాలి. ఇదే ఆలోచన కాకతీయను ఇతర ప్రాంతీయ మీడియా వేదికల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టింది.

### వార్తలు కాదు... వాస్తవాల వేట

నేటి మీడియా ప్రపంచంలో 'ఫస్ట్' కోసం పోటీ ఎక్కువ. కానీ కాకతీయ 'ట్రూత్ ఫస్ట్' అనే సూత్రాన్ని ఎంచుకుంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ప్రతి సమాచారాన్ని వార్తగా మార్చలేదు. అధికారుల ప్రకటనలను యథాతథంగా ప్రచురించలేదు. ఒక సమాచారం చేతికి వస్తే... దానికి ఆధారాల కోసం వెతికింది. పత్రాలు సేకరించింది. బాధితుల వాంగ్మూలాలు నమోదు చేసింది. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించింది. అన్ని వైపుల సమాచారం సేకరించిన తర్వాతే కథనాలను ప్రజల ముందుకు తీసుకొచ్చింది. అందుకే కాకతీయ కథనాలకు ఒక ప్రత్యేకత ఏర్పడింది. అవి కేవలం ఆరోపణలుగా మిగలలేదు. ఆధారాలతో కూడిన ప్రజా పత్రాలుగా నిలిచాయి. ఏ పత్రిక అయినా తన ఎడిటోరియల్ పాలసీని మాటల్లో చెబుతుంది. కాకతీయ మాత్రం దానిని కథనాల్లో చూపించింది. రైతు భూమి సమస్య నుంచి మొదలుకొని... ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్లక్ష్యం వరకు... ఇసుక మాఫియా నుంచి ప్రభుత్వ భూముల ఆక్రమణల వరకు... స్థానిక సంస్థల అవినీతి నుంచి వేల కోట్ల ప్రాజెక్టుల దోపిడీల వరకు... ప్రజలకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిరంతరం వెలుగులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వాన్ని విమర్శించాలనే ఉద్దేశంతో కాదు... ప్రజల సమస్య పరిష్కారమే లక్ష్యంగా వార్తలను ప్రచురించింది. అందుకే కాకతీయ కథనాల తర్వాత అనేక సందర్భాల్లో అధికారులు స్పందించారు. విచారణలు జరిగాయి. చర్యలు ప్రారంభమయ్యాయి. కొన్ని చోట్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం కూడా తిరిగి వచ్చింది. ఒక వార్త సమాజంలో మార్పు తీసుకురావాలంటే... ఆ వార్త వెనుక నిబద్ధత ఉండాలి. కాకతీయ మొదటి ఏడాది అదే నిరూపించింది.

### రాజీపడని కలం... వెనక్కి తగ్గని వైఖరి

ఒక అవినీతి కథనం ప్రచురించడం సులభమే. కానీ ఆ కథనం తర్వాత వచ్చే ఒత్తిడిని ఎదుర్కోవడం అంత సులభం కాదు. మొదటి ఏడాదిలోనే కాకతీయ ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొంది. ప్రకటనల ఒత్తిడి... రాజకీయ ఒత్తిడి... అధికార యంత్రాంగం ఒత్తిడి... దుష్ప్రచారాలు... కేసుల బెదిరింపులు... వ్యక్తిగత దాడులు... సోషల్ మీడియా ట్రోలింగ్... అన్నింటినీ ఎదుర్కొంది. కానీ ఒక విషయంలో మాత్రం ఎక్కడా రాజీపడలేదు. వార్త నిజమైతే... దానిని ప్రచురించడంలో వెనక్కి తగ్గలేదు. అదే కాకతీయను పాఠకులకు దగ్గర చేసింది. కొంతమంది ఇప్పటికీ ఒక అపోహలో ఉంటారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అది వ్యతిరేకత అని. కానీ కాకతీయ మొదటి ఏడాది చూపించిన విధానం వేరు. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలను స్వాగతించింది. మంచి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లింది. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చింది. అదే సమయంలో... ప్రజా ధనాన్ని దోచుకునే ప్రయత్నాలను మాత్రం తీవ్రంగా ఎండగట్టింది.

అందుకే ఒకవైపు ప్రభుత్వ శాఖల పనితీరును ప్రశంసించిన కథనాలే కనిపిస్తే... మరోవైపు అదే శాఖలో జరుగుతున్న అవినీతిని కూడా బహిర్గతం చేసిన కథనాలు కనిపించాయి. ఇది ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండే ధోరణి కాదు. ప్రజలకు అనుకూలంగా ఉండే జర్నలిజం.

### పత్రిక కాదు... ప్రజల వేదిక

గత ఏడాది కాలంలో కాకతీయకు వచ్చిన వేలాది సమాచారం అన్నీ పెద్ద నాయకుల నుంచి రాలేదు.

సాధారణ రైతు, ఒక గ్రామస్తుడు, ఒక ఉద్యోగి,ఒక బాధిత మహిళ, ఒక యువకుడు, ఒక గిరిజనుడు... వీరే కాకతీయ అసలైన రిపోర్టర్లు. వాళ్లు పంపిన సమాచారాన్ని పరిశీలించింది. ఆధారాలు సేకరించింది. నిజమైతే ప్రచురించింది. దీంతో కాకతీయ ఒక మీడియా సంస్థగా మాత్రమే కాకుండా... ప్రజలు నమ్మి సమస్య చెప్పుకునే వేదికగా మారింది. నిజం చెప్పడం సులభం కాదు... కానీ అవసరం.

"యథార్థవాది... లోకవిరోధి" అనే నానుడి చాలా మందికి తెలుసు. నిజం చెప్పేవాడు అందరికీ నచ్చడు. అక్రమాలు బయటపెడితే అక్రమార్కులకు నచ్చదు. అవినీతి వెలుగులోకి తెస్తే అవినీతిపరులకు నచ్చదు. మాఫియాలపై రాస్తే మాఫియాలకు నచ్చదు. అదే కాకతీయ కూడా అనుభవించింది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టమైంది. దాడులు చేసిన వారు తాత్కాలికం... నమ్మకం ఇచ్చిన పాఠకులు శాశ్వతం. అందుకే ప్రతి దాడి తర్వాత... ప్రతి దుష్ప్రచారం తర్వాత... కాకతీయకు మరింత మంది పాఠకులు జత కలిశారు.

### గొప్పదనం సర్క్యులేషన్‌తో కాదు..

ఒక పత్రిక గొప్పదనం తన సర్క్యులేషన్‌తో కాదు... తన కథనాల ప్రభావంతో కొలవాలి. ఒక వార్త ప్రచురించిన తర్వాత ఏమైంది? వ్యవస్థ కదిలిందా? అధికారులు స్పందించారా? ప్రజలకు న్యాయం జరిగిందా? అనే ప్రశ్నలకే అసలు విలువ ఉంటుంది. ఆ కోణంలో చూస్తే... కాకతీయ తొలి ఏడాది ప్రయాణం అనేక కీలక మలుపులకు కారణమైంది. కాకతీయ ప్రచురించిన కథనాలు కేవలం వార్తలుగా ముగియలేదు. చాలా సందర్భాల్లో అవి ప్రభుత్వ శాఖల్లో ఫైళ్లు కదిలించాయి. అధికారులను క్షేత్రస్థాయికి వెళ్లేలా చేశాయి. కొన్ని చోట్ల విచారణలు ప్రారంభమయ్యాయి. మరికొన్ని చోట్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం తిరిగి ఖజానాకు చేరింది. ఒక ప్రాంతీయ డిజిటల్ మీడియా వేదికకు ఇది చిన్న విజయమేమీ కాదు.

### ఇసుక మాఫియాపై నిరంతర యుద్ధం

మొదటి ఏడాది మొత్తం కాకతీయ అత్యంత తీవ్రంగా దృష్టి పెట్టిన అంశం అక్రమ ఇసుక దందా. ఉమ్మడి వరంగల్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వందల కోట్ల రూపాయల ఇసుక దోపిడీ ఎలా సాగుతోంది? ప్రభుత్వ నిబంధనలను ఎలా తుంగలో తొక్కుతున్నారు? అధికార యంత్రాంగంలో ఎవరి పాత్ర ఏమిటి? అనే అంశాలను వరుస కథనాలతో వెలుగులోకి తీసుకొచ్చింది. మణుగూరు పరిసరాల్లో రైతులే లేని గ్రామాల పేరుతో ఇసుక ర్యాంపులు ఎలా వచ్చాయి? సింగరేణి భూముల్లో అక్రమ తవ్వకాలు ఎలా సాగుతున్నాయి? గిరిజనుల పేరుతో నకిలీ సొసైటీలు ఎలా సృష్టించారు? రాత్రి వేళల్లో 'జీరో లారీలు' ఎలా తిరుగుతున్నాయి? వంటి ప్రశ్నలను మొదటిసారి ఆధారాలతో ప్రజల ముందుంచింది. ఇది ఒక్కరోజు వార్త కాదు. నెలల తరబడి కొనసాగిన పరిశోధన. అధికారుల వివరణలు సేకరించింది. బాధితుల వాంగ్మూలాలు నమోదు చేసింది. ప్రభుత్వ పత్రాలు పరిశీలించింది. ఆ తర్వాతే కథనాలు వెలువడ్డాయి. ఈ కథనాల తర్వాత ఇసుక అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ మొదలైంది. ప్రజలు కూడా ప్రశ్నించడం ప్రారంభించారు. బెదిరింపులు... కేసుల ప్రయత్నాలు... అయినా వెనక్కి తగ్గలేదు. అక్రమాలపై రాస్తే అభినందనలు మాత్రమే రావు. బెదిరింపులు కూడా వస్తాయి. కాకతీయ కూడా అదే అనుభవించింది. ములుగు జిల్లాలో ఇసుక సొసైటీల కేటాయింపులపై వెలువడిన కథనాలు పెద్ద చర్చకు దారితీశాయి. బాధితులు అందించిన పత్రాలు, ఆధారాలతో ప్రచురించిన వార్తలు కొందరికి అసహనాన్ని కలిగించాయి. ఆ తర్వాత పత్రికపై ఒత్తిడి తీసుకురావాలనే ప్రయత్నాలు జరిగాయి. పోలీసు కేసులు పెట్టించేందుకు కూడా ప్రయత్నాలు జరిగాయి. కానీ వాస్తవాలు, ఆధారాల ముందు అవన్నీ నిలబడలేకపోయాయి. ఒక వార్తను ఖండించాలంటే ఆధారాలతో ఖండించాలి. కానీ కథనాలను తప్పుబట్టలేని వారు... పత్రికను లక్ష్యంగా చేసుకోవడం కొత్త విషయం కాదు.

.........తరువాయి 2లో

# మేఘా దొంగే..!







(మొదటి పేజీ తరువాయి)

### కథనాలే కదిలించిన యంత్రాంగం...

గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం పేరుతో హనుమకొండ జిల్లా నడికూడ మండలం కౌకొండ గుట్టల్లో జరుగుతున్న తవ్వకాలపై మొదటిసారి కాకతీయ వరుస కథనాలు ప్రచురించింది. గుట్టలను ఏ అనుమతులతో తవ్వుతున్నారు..? ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం ఎంత..? పర్మిట్ ఫీజులు, రాయల్టీలు చెల్లించారా..? సంబంధిత శాఖలు పర్యవేక్షణ చేశాయా..? అనే ప్రశ్నలను వరుస కథనాల్లో లేవనెత్తింది. ప్రజా సంపద వినియోగానికి సంబంధించిన లెక్కలు బహిర్గతం కావాలని డిమాండ్ చేసింది. ఈ కథనాల తర్వాత సంబంధిత శాఖల్లో కదలిక మొదలైంది. అధికార యంత్రాంగం దృష్టి కౌకొండ గుట్టల తవ్వకాలపై పడింది. ఇదే సమయంలో అధికారిక రికార్డులను వెలికితీసేందుకు సమాచార హక్కు చట్టాన్ని ఆశ్రయించారు.

### సమాచారం అడ్డుకునే ప్రయత్నం...
### కమిషన్‌తో వెలుగులోకి నిజాలు

ఆర్‌టీఐ దరఖాస్తుల అనంతరం సమాచారం వెంటనే అందలేదు. మేఘా సంస్థ సమాచారం విడుదలపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు అధికారిక రికార్డులు వెల్లడించాయి. దీంతో వివరాలు బయటకు రాకుండా నిలిపివేయాలనే ప్రయత్నం జరిగింది. అయితే విషయం రాష్ట్ర సమాచార కమిషన్ ముందుకు వెళ్లింది. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన సమాచారమని భావించిన కమిషన్... సంబంధిత రికార్డులను విడుదల చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల అనంతరం గనుల శాఖ ట్రెజరీ చలాన్లు, బ్యాంకు లేఖలు, చెల్లింపు వివరాలను విడుదల చేసింది. అప్పటి వరకు ఫైళ్లకే పరిమితమైన పత్రాలు ప్రజల ముందుకు వచ్చాయి. ఈ పరిణామమే మొత్తం వ్యవహారానికి కీలక మలుపుగా నిలిచింది.

### పర్మిట్ ఫీజుగా రూ.17.62 లక్షలు...
### ఎన్ఎస్ఎఫ్‌గా రూ.22.03 లక్షలు

ఆర్‌టీఐ ద్వారా వెలుగులోకి వచ్చిన ట్రెజరీ చలాన్ల ప్రకారం... 2026 జూన్ 8న ట్రెజరీ చలాన్ నంబర్ 6600970045 ద్వారా మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ రూ.17,62,987ను మైనింగ్ పర్మిట్ ఫీజు కింద ప్రభుత్వ ఖజానాకు జమ చేసింది. చలాన్‌లో "Towards Permit Fee" అని స్పష్టంగా నమోదైంది. అదే రోజు ట్రెజరీ చలాన్ నంబర్ 6600970071 ద్వారా రూ.22,03,734ను గ్రావెల్‌పై ఎన్ఎస్ఎఫ్ (NSF) కింద ప్రభుత్వ ఖజానాకు చెల్లించినట్లు మరో అధికారిక పత్రం వెల్లడించింది. ఈ రెండు చెల్లింపులు కలిపి ప్రభుత్వ ఖజానాకు రూ.39,66,721 చేరినట్లు ట్రెజరీ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

### ట్రస్ట్‌లకు మరో రూ.7.05 లక్షలు

ట్రెజరీ చలాన్లతో పాటు యూనియన్ బ్యాంక్ వరంగల్ బ్రాంచ్‌కు మేఘా పంపిన అధికారిక లేఖలు కూడా ఆర్‌టీఐ ద్వారా బయటపడ్డాయి. వాటి ప్రకారం... డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (DMFT), హనుమకొండకు రూ.6,61,120, స్టేట్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ (SMET)కు రూ.44,075, ఎన్ఈఎఫ్‌టీ ద్వారా బదిలీ చేయాలని బ్యాంకును కోరింది. ఇందుకు సంబంధించిన చెక్కుల ప్రతులు కూడా అధికారిక రికార్డుల్లో ఉన్నాయి. ఈ రెండు మొత్తాలు కలిపి రూ.7,05,195 అవుతున్నాయి. ప్రభుత్వ సంబంధిత ఖాతాలకు మొత్తం రూ.46.71 లక్షలు చేరాయి. ఆర్‌టీఐ ద్వారా లభించిన అధికారిక పత్రాలను సమగ్రంగా పరిశీలిస్తే... మైనింగ్ పర్మిట్ ఫీజు – రూ.17,62,987, గ్రావెల్‌పై ఎన్ఎస్ఎఫ్ – రూ.22,03,734, డీఎంఎఫ్‌టీకి – రూ.6,61,120, స్టేట్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్‌కు – రూ.44,075 మొత్తంగా రూ.46,71,916 ప్రభుత్వ సంబంధిత ఖాతాలకు చెల్లించినట్లు అధికారిక రికార్డులు నిర్ధారిస్తున్నాయి. కౌకొండ గుట్టల వ్యవహారంపై కాకతీయ వరుస కథనాల అనంతరం ఈ చెల్లింపులకు సంబంధించిన రికార్డులు వెలుగులోకి రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### అక్షర పోరాటానికి అధికారిక పత్రాలే ముద్ర

కౌకొండ గుట్టల వ్యవహారంలో కాకతీయ కేవలం ప్రశ్నలు లేవనెత్తి ఆగిపోలేదు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశంపై నిరంతర పరిశోధన సాగించింది. అధికార యంత్రాంగం స్పందించేలా చేసింది. చివరకు సమాచార హక్కు చట్టం ద్వారా అధికారిక రికార్డులను ప్రజల ముందుకు తీసుకొచ్చింది. దాచిపెట్టాలనుకున్న లెక్కలు.. ప్రభుత్వ ఖాతాలకు జరిగిన చెల్లింపులు.. ట్రెజరీ చలాన్లు.. బ్యాంకు లేఖలు.. ఇవన్నీ ఇప్పుడు అధికారిక పత్రాల రూపంలో ప్రజల ముందున్నాయి. ప్రజా సంపదకు సంబంధించిన ప్రతి లెక్కను ప్రశ్నించే ధైర్యం, ఆ ప్రశ్నలకు ఆధారాలు సేకరించే పరిశోధనాత్మక దృక్పథం, వెలుగులోకి వచ్చిన రికార్డులు... ఇవన్నీ కలిపి కౌకొండ గుట్టల వ్యవహారాన్ని కాకతీయ అక్షరపోరాటానికిమరో మైలురాయిగా నిలిపాయి.

# ఏడాది కాకతీయ

(మొదటి పేజీ తరువాయి)

### కాకతీయ దాన్నీ ఎదుర్కొంది.

### మేఘా అక్రమాలపై కలం... ఖజానాకు రూ.42 లక్షలు

దేశంలోనే ప్రముఖ నిర్మాణ సంస్థల్లో ఒకటైన మేఘా సంస్థపై కథనాలు ప్రచురించడం అంత సులభమైన విషయం కాదు. హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని కౌకొండ గుట్టలను ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వుతున్నారనే సమాచారం వచ్చినప్పుడు... కాకతీయ దానిని సీరియస్‌గా తీసుకుంది. క్షేత్రస్థాయిలో పరిశీలించింది. అనుమతుల పరిస్థితిని పరిశీలించింది. సంబంధిత శాఖల నుంచి సమాచారం సేకరించింది. ఆ తర్వాత వరుస కథనాలు ప్రచురించింది. ఆ కథనాల ప్రభావంతో అధికారులు విచారణ చేపట్టారు. చివరకు అక్రమాలకు జరిమానా విధించి... మేఘా సంస్థ నుంచి రూ.42 లక్షలు ప్రభుత్వ ఖజానాకు జమయ్యాయి. ఒక ప్రాంతీయ మీడియా కథనం ప్రభుత్వానికి నేరుగా ఆదాయం తెచ్చిపెట్టిన అరుదైన ఉదాహరణగా ఇది నిలిచింది. ప్రభుత్వం స్పందించింది... అదే మా బలం. పత్రిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండాల్సిన అవసరం లేదు. కానీ ప్రజా ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం స్పందించేలా చేయాలి. కాకతీయ కథనాల తర్వాత అనేక శాఖలు స్పందించాయి. కొన్ని చోట్ల అక్రమ తవ్వకాలపై చర్యలు జరిగాయి. కొన్ని చోట్ల అధికారుల వివరణలు వచ్చాయి. మరికొన్ని చోట్ల విచారణలు ప్రారంభమయ్యాయి. ఇది కాకతీయ విజయమే కాదు... ప్రజా జర్నలిజం విజయమని చెప్పాలి.

1) నేటి మీడియాపై వచ్చే పెద్ద విమర్శ ఏమిటంటే... ప్రకటనల కోసం వార్తలు మారుతున్నాయనేది.
2) కాకతీయ మాత్రం మొదటి ఏడాది ఈ విమర్శకు భిన్నంగా నిలిచింది.
3) ప్రకటన ఇచ్చినవారిపై కూడా అవసరమైతే కథనాలు ప్రచురించింది
4) అధికార పార్టీ నేతలపైనా రాసింది. ప్రతిపక్ష నేతలపైనా రాసింది.
5) అధికారులపై కూడా రాసింది. వ్యాపార సంస్థలపైనా రాసింది.

### ఎందుకంటే కాకతీయకు ప్రమాణం ఒకటే...

"వార్త నిజమా... కాదా?" అంతే. సోషల్ మీడియా శబ్దం కాదు... ఆధారాలే బలం. ఈరోజు ఒక పోస్టు వైరల్ అయితే... అది వార్త అయిపోతున్న కాలం. కానీ కాకతీయ మాత్రం వైరల్‌ను కాదు... వాస్తవాన్ని నమ్మింది.
ప్రతి కథనం వెనుక డాక్యుమెంట్లు. ప్రతి ఆరోపణ వెనుక ఆధారాలు. ప్రతి విశ్లేషణ వెనుక క్షేత్రస్థాయి సమాచారం. అందుకే కాకతీయ కథనాలను ప్రజలు విశ్వసించడం ప్రారంభించారు. ప్రజలే మా రిపోర్టర్లు.
ప్రజలు తమ సమస్య చెప్పడానికి నమ్మిన వేదికగా కాకతీయ మారడం... ఈ ఏడాది సాధించిన అతి పెద్ద విజయాల్లో ఒకటి. పత్రికలు మూతపడటానికి కారణం ఆర్థిక సమస్యలు మాత్రమే కావు. విలువలు కోల్పోవడమూ ఒక కారణమే. పరిమిత వనరులతో పనిచేస్తూ కూడా... కాకతీయ తన సంపాదకీయ స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంది. ఒత్తిడికి తలవంచలేదు. బెదిరింపులకు భయపడలేదు. అవమానాలకు వెనక్కి తగ్గలేదు. ఎందుకంటే ఈ పత్రిక వెనుక ఉన్న అసలు బలం... కార్యాలయం కాదు... పాఠకుల విశ్వాసం. ఈ పోరాటం ఇంకా ముగియలేదు. ఏడాది పూర్తి కావడం ఒక మైలురాయి మాత్రమే. మాది గమ్యం కాదు.. ఎప్పుడూ గమనమే ముఖ్యం మాకు. ఇంకా బయటపడాల్సిన అక్రమాలు ఉన్నాయి. ప్రశ్నించాల్సిన అధికార వ్యవస్థ ఉంది. న్యాయం కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది ఉన్నారు. అవినీతి, మాఫియా, అక్రమాలు రూపం మార్చుకుంటాయి. కానీ వాటిని ప్రశ్నించే కలం కూడా ఆగకూడదు. కాకతీయ రెండో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ... ఒక వాగ్దానం మాత్రం మళ్లీ పునరుద్ఘాటిస్తోంది. మా కలం అధికారానికి కాదు... ప్రజలకు అంకితం. మా బాధ్యత వార్తలు ప్రచురించడం మాత్రమే కాదు... ప్రజా ప్రయోజనాలను కాపాడే ప్రతి పోరాటంలో ముందుండడం. సత్యం కోసం మొదలైన ఈ ప్రయాణం... మరింత పదునుగా, మరింత ప్రజాపక్షంగా, మరింత నిర్భయంగా కొనసాగుతుంది.

ఎడిటర్ - అరెల్లి కిరణ్ గౌడ్ -7396604266



# జీఎస్టీలో ఏఐ వినియోగం..
# లీకేజీలకు చెక్

- వివిధ శాఖల డేటాతో సమగ్ర ఏఐ వ్యవస్థ
- రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంపే లక్ష్యంగా సంస్కరణలు
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో కీలక భేటీ

కాకతీయ, తెలంగాణ బ్యూరో : రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో జీఎస్టీ రాబడులను పెంచడంతో పాటు పన్ను ఎగవేత, లీకేజీలకు అడ్డుకట్ట వేయడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు ప్రముఖ భారత ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో విస్తృతంగా చర్చించారు. హైదరాబాద్‌లో ని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత బలోపేతం చేసే ప్రణాళికలు, జీఎస్టీ, ఎక్సైజ్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై సమగ్రంగా చర్చించారు. జీఎస్టీ అధికారులకు ఏఐ ఆధారిత సమాచార వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి, పన్నుల అంచనా, పర్యవేక్షణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ వ్యవస్థ అమలుతో రాష్ట్ర ఖజానాకు ఆదా యం పెరగడంతో పాటు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. పన్ను వసూళ్లు పెంచుతూనే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత మెరుగుపరిచేలా సాంకేతికతను వినియోగించాలని పేర్కొన్నారు.

### శాఖల మధ్య సమన్వయంతో లీకేజీల నివారణ

భవన నిర్మాణ రంగంలో పన్ను లీకేజీలను అరికట్టేందుకు మున్సిపల్, రేరా, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల మధ్య ఏఐ సాయంతో సమన్వయం పెంచా లని సమావేశంలో నిర్ణయించారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు అనుమతులు ఇచ్చే దశలోనే నిర్మాణ సామగ్రి అవసరాలు, వాటికి సంబంధించిన పన్నుల అంచనాలను నమోదు చేసే విధానాన్ని తీసుకురావాలని సూచించారు. మీసేవ, ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ ఎఫ్) వంటి వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించిన సమాచారాన్ని కూడా సమీకృతం చేస్తే పరిపాలన మరింత సమర్థవంతంగా మారుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, కమర్షియల్ ట్యాక్స్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం వరుణ యాగం

### ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో ప్రత్యేక క్రతువులు
### పూర్ణాహుతిలో పాల్గొననున్న సీఎం రేవంత్ రెడ్డి

కాకతీయ, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి కృష్ణా, గోదావరి నదులు, చెరువులు జలకళ సంతరించుకోవడంతో పాటు పాడిపంటలు సమృద్ధిగా పండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 10న వరుణ యాగం నిర్వహించనుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ యాగం నిర్వహించనున్నారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేద పండితులు, సిద్ధాంతులు ఆగస్టు 10వ తేదీని ముహూర్తంగా నిర్ణయించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో యాగ క్రతువులు నిర్వహించనుండగా, అనంతరం జరిగే మహా పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి వ్యవసాయం సమృద్ధిగా సాగాలనే సంకల్పంతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

# నీళ్లపై బీఆర్ఎస్‌ది రాజకీయ డ్రామా




- రాజకీయ పబ్బం గడుపుకునేందుకే హంగు ఆర్భాటాలు
- నీటి విడుదలపై ముందే హంగామా చేసి క్రెడిట్ కొట్టేయాలనేది బీఆర్ఎస్ ఎత్తుగడ
- పదేళ్లు పాలించి ప్రాజెక్టులు పూర్తి చేయని వారికి మాట్లాడే నైతిక హక్కు లేదు
- పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం.. రైతులు ఆందోళన చెందొద్దు: మంత్రి జూపల్లి
- కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను సాధించి తీరుతాం: మంత్రి జూపల్లి కృష్ణారావు

కాకతీయ,తెలంగాణ బ్యూరో : ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, సాగునీటి అధికారుల ప్రణాళిక మేరకే జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీటి నిర్వహణ జరుగుతోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు నీళ్లు ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయ లబ్ధి పొందేందుకే ఆ పార్టీ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా చేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వంద శాతం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పారు. శుక్రవారం సచివాలయం మీడియా సెంటర్‌లో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, ఈఎన్సీ (జనరల్) రమేష్‌బాబు, సీఈ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాలతో పాటు ఇతర ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరుగుతోందని, వచ్చిన నీటికి అనుగుణంగా సాగునీటి అధికారులు ప్రణాళిక ప్రకారం విడుదల చేస్తున్నారని మంత్రి చెప్పారు. ఈ విషయం ముందే తెలిసిన బీఆర్ఎస్ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా, ఆర్భాటాలు, డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. అధికారులు నీళ్లు విడుదల చేసిన వెంటనే అది తమ ఒత్తిడితో జరిగిందని ప్రచారం చేసుకోవడానికే ఈ రాజకీయ నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి, పాలమూరు జిల్లా అల్లుడు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీళ్లు ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమన్నారు. వారి సారథ్యంలోనే ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు కాంగ్రెస్ హయాంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టులను పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందన్నారు. కల్వకుర్తి కింద అదనంగా 25 టీఎంసీల నీటిని అందించే ప్రాజెక్టును ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ఎత్తిపోతల పనులను ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. పంపులు, మోటార్లు, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌పై గొప్పలు చెప్పుకున్న బీఆర్ఎస్ పాలమూరు సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు విస్మరించిందని విమర్శించారు. భీమా ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించే అవకాశాన్ని కోల్పోయిందన్నారు. జూరాలకు 50 టీఎంసీల వినియోగానికి అవసరమైన రిజర్వాయర్లు, గట్టు, తుమ్మిళ్ల వంటి ప్రాజెక్టులను ఎందుకు నిర్లక్ష్యం చేసిందని ప్రశ్నించారు. తెలంగాణ నీటి హక్కులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం "అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు" ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసిందని మంత్రి ధ్వజమెత్తారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో 811 టీఎంసీల నీటిలో తెలంగాణకు అధిక వాటా సాధించుకునే అవకాశాన్ని వదులుకుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు కేవలం 299 టీఎంసీల హక్కులు కల్పించే పరిస్థితిని తీసుకొచ్చిందన్నారు.
రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడుతోందని, కృష్ణా జలాల్లో రాష్ట్ర హక్కులను సాధించి తీరుతామని స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని మంత్రి తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వంద శాతం పూర్తి చేస్తామని చెప్పారు. పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అనేక ప్రాజెక్టులకు పరిపాలనా అనుమతులు ఇవ్వకుండా, టెండర్లు పిలవకుండా, పనులు ప్రారంభించకుండా కాలయాపన చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిన వారే ఇప్పుడు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నందున అధికారులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు మంత్రి సూచించారు. పంట కొనుగోలు, బోనస్‌పై బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌కు డెడ్‌లైన్ విధించి అధికారానికి దూరం చేశారని, ఇక ఆ పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. రాజకీయ గప్పాలు చెప్పడం తప్ప పాలన తెలియదని, తెలంగాణ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వృథా చేసి రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. పాలమూరు జిల్లా రైతులు, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ ప్రాధాన్యంగా తీసుకుని వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు.

# విజయ్ విడాకుల కేసుకు ముగింపు..
# పిటిషన్ వెనక్కి తీసుకున్న సంగీత

### వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరైన విజయ్ భార్య
### విచారణ కొనసాగించబోనని స్పష్టం చేసిన సంగీత
### వివరణతో ఏకీభవించిన కోర్టు.. కేసు ముగింపు
### మళ్లీ ఒక్కటవుతారా..? అభిమానుల్లో ఆసక్తి

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్ కుటుంబ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. విజయ్ నుంచి విడాకులు కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఆయన భార్య సంగీత వెనక్కి తీసుకోవడంతో ఈ కేసుకు ముగింపు పలికింది. శుక్రవారం చెంగల్‌పట్టు జిల్లా ఫ్యామిలీ కోర్టులో జరిగిన విచారణకు సంగీత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై, ఇకపై విడాకుల కేసును కొనసాగించబోనని కోర్టుకు తెలిపారు. ఆమె వివరణను పరిశీలించిన కోర్టు పిటిషన్ ఉపసంహరణకు అనుమతి ఇచ్చి కేసును ముగించింది. విజయ్ నుంచి విడాకులు మంజూరు చేయాలని కోరుతూ సంగీత గతేడాది డిసెంబర్ 23న చెంగల్‌పట్టు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు లో పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం ఈ కేసును ఫ్యామిలీ కోర్టుకు బదిలీ చేశారు. 2021లో ఓ నటితో విజయ్‌కు వివాహేతర సంబంధం ఏర్పడిందని, ఆ సంబంధాన్ని తెంచుకుంటానని హామీ ఇచ్చినా నిలబెట్టుకోలేదని సంగీత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో భార్యాభర్తల బంధానికి ద్రోహం జరిగిందని ఆరోపిస్తూ విడాకులు కోరారు.

### వాయిదాల తర్వాత కేసు ముగింపు

భద్రతా కారణాలు, ఇతర ఇబ్బందుల దృష్ట్యా విజయ్, సంగీత ఇద్దరూ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే విచారణలో పాల్గొంటూ వచ్చారు. పలుమార్లు వాయిదా పడిన ఈ కేసు శుక్రవారం మరోసారి విచారణకు రాగా, సంగీత స్వచ్ఛందంగా పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దీంతో కోర్టు విచారణను ముగించింది. 1995 ఆగస్టు 25న విజయ్, సంగీత వివాహం జరిగింది. వీరికి కుమారుడు జేసన్ సంజయ్, కుమార్తె దివ్య సాష ఉన్నారు. విడాకుల పిటిషన్ ఉపసంహరణతో విజయ్–సంగీత మళ్లీ కలిసే అవకాశాలపై చర్చ మొదలైంది. అయితే ఈ అంశంపై ఇప్పటివరకు విజయ్ గానీ, సంగీత గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా కొనసాగుతుండగా, సంగీత విదేశాల్లో నివసిస్తున్నారు.

ఉత్తరం
కాకతీయ
శనివారం 08 ఆగస్ట్ 2026


- కేసీఆర్ హయాంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలు
- నాటి పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఒక్కటీ అమలు చేయాలేదు
- చేనేత విషయంలో బీజేపీ-కాంగ్రెస్ వైఖరి ఒక్కటే
- ప్రభుత్వ ఆర్డర్లను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారు
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు భరోసా కల్పించాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

# నేతన్నల కడుపు కొడుతున్న కాంగ్రెస్

కాకతీయ, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలోని చేనేత కార్మికుల జీవనోపాధిపై కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బకొట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు (కేటీఆర్) ఆరోపించారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన ఆయన.. కేసీఆర్ హయాంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి సంక్షేమ పథకాలను నిలిపివేసి నేతన్నలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన చేనేత హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపిస్తూ.. వెంటనే అన్ని పథకాలను పునరుద్ధరించి నేతన్నలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. చేనేత రంగం విషయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిలో తేడా లేదని, ప్రభుత్వ ఆర్డర్లను ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు అప్పగించడం వల్ల చేనేత కుటుంబాలు నష్టపోతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.



## కేసీఆర్ హయాంలో ప్రత్యేక పథకాలు

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో దేశంలో ఎక్కడా లేని విధంగా చేనేత రంగానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55,072 మంది చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తూ 'నేతన్న బీమా' పథకాన్ని అమలు చేశామని తెలిపారు. ఒక్కో కార్మికుడి బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించిందన్నారు. 'నేతన్నకు చేయూత' పథకం ద్వారా కార్మికుడు ప్రతి నెల రూ.1,200, అనుబంధ కార్మికుడు రూ.800 చెల్లిస్తే ప్రభుత్వం రూ.4 వేల వరకు వాటా జమ చేసే విధానాన్ని అమలు చేశామని పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, 20 శాతం మార్కెటింగ్ రిబేట్‌తో పాటు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాలల యూనిఫారాల తయారీ వంటి భారీ ప్రభుత్వ ఆర్డర్లను చేనేత రంగానికే అప్పగించి వేలాది కుటుంబాలకు నిరంతర ఉపాధి కల్పించామని వివరించారు.

## కాంగ్రెస్‌పై వరుస ఆరోపణలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన చేనేత సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేసిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రస్తుతం 'నేతన్న బీమా' అమలు కావడం లేదని, 'నేతన్నకు చేయూత' పథకం చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు నిలిచిపోయాయని, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ యూనిఫారాల వంటి ఆర్డర్లలో నేతన్నలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యతను తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వ ఆర్డర్లను కమిషన్ల కోసం ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. చేనేత కార్మికులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. చేనేత భరోసా కింద ప్రతి ఏడాది రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సహాయం, లక్ష రూపాయల వరకు వ్యక్తిగత రుణమాఫీ, చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాల మాఫీ, కేంద్రం విధిస్తున్న 5 శాతం జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్న హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించారు. రెండున్నరేళ్లు గడిచినా నేతన్నలకు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు.

## బీజేపీపై కూడా విమర్శలు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా చేనేత రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డులను రద్దు చేయడం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ వంటి పథకాలను ఎత్తివేయడం, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ విధించడం వంటి నిర్ణయాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. పార్టీలు వేరైనా చేనేత విషయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిలో ఎలాంటి తేడా లేదని ఆరోపించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన బహిరంగ లేఖలో చేనేత కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని కేటీఆర్ కోరారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలను వెంటనే పునరుద్ధరించి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన చేనేత భరోసా, రుణమాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలను తక్షణమే అమలు చేసి నేతన్నల కుటుంబాలకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

## రిషి బార్‌లో కుళ్లిన బిర్యానీ కలకలం..!

**దుర్వాసన రావడంతో వినియోగదారుల ఆందోళన**

**ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలపై ప్రశ్నలు**





కాకతీయ, వరంగల్ ప్రతినిధి: వరంగల్ ఏనుమాముల మార్కెట్ ప్రాంతంలోని రిషి రెస్టో బార్ అండ్ రెస్టారెంట్‌లో కుళ్లిన బిర్యానీ వడ్డించారంటూ వినియోగదారులు గురువారం ఆందోళనకు దిగారు. బిర్యానీ నుంచి దుర్వాసన రావడంతో రెస్టారెంట్ నిర్వాహకులను నిలదీయగా వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో నగరంలో చర్చనీయాంశంగా మారింది. సమాచారం ప్రకారం, కొందరు వినియోగదారులు మద్యం, బిర్యానీ ఆర్డర్ చేశారు. బిర్యానీ తింటుండగా దుర్వాసన రావడంతో వారు వెంటనే రెస్టారెంట్ సిబ్బందిని ప్రశ్నించారు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు తెలిసింది. ఈ ఘటనతో నగరంలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో అందిస్తున్న ఆహార నాణ్యతపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మురికికాల్వల పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించడం, ఈగలు ముసురుతున్న మాంసాహారం విక్రయించడం, పలుమార్లు వాడిన వంటనూనెతో ఆహారం తయారు చేయడం వంటి అంశాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు సమర్థవంతమైన తనిఖీలు నిర్వహించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలో విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కలుషిత ఆహారం విక్రయించడం వల్ల ప్రజారోగ్యానికిముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సహారా బాధితుల పోరాటం కొనసాగుతుంది

- సహారా బాధితులు, ఉద్యమ నాయకుల పిలుపు
- న్యూఢిల్లీలో మూడో రోజుకు చేరిన మహాధర్నా
- డిపాజిటర్ల సొమ్ము వెంటనే చెల్లించాలని కేంద్రానికి విజ్ఞప్తి



కాకతీయ, వరంగల్ బ్యూరో: సహారా సంస్థల్లో డిపాజిట్ చేసిన ప్రతి రూపాయిని డిపాజిటర్లకు తక్షణమే తిరిగి చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని సహారా బాధితులు, ఉద్యమ నాయకులు డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలో సహారా బాధితులు, ఏజెంట్లు చేపట్టిన మహాధర్నా శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బాధితులు శాంతియుతంగా నిరసన కొనసాగించారు. తమ కష్టార్జిత సొమ్ము పూర్తిగా తిరిగి అందే వరకు ఉద్యమాన్ని విరమించబోమని స్పష్టం చేశారు. బాధితుల సమస్యను కేంద్ర ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

### ఐక్య పోరాటంతోనే హక్కుల సాధన

సహారా బాధితులందరూ ఐక్యంగా ఉద్యమించి తమ హక్కులను సాధించుకోవాలని ఉద్యమ నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి డిపాజిటర్లకు వారి డిపాజిట్ మొత్తాలను త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహాధర్నాలో వరంగల్ కాశిబుగ్గకు చెందిన దక్క సుధాకర్, నాగబండి రాము, క్యాతం వేణు, బొప్పరాతి శివకృష్ణ, మోత్కూర్ నవీన్, సబ్బాని శ్రీధర్, మురళి తదితరులు పాల్గొని బాధితులకు సంఘీభావం తెలిపారు.

## పచ్చ బస్సులు తుస్సు..
# ప్రయాణికులకు చుక్కలు..!




**పర్యావరణ హితం పేరుతో ప్రజలకు నరకయాతన**

**నడిరోడ్డుపై మొరాయిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు**

**కరీంనగర్ ఘటన తర్వాతా మారని ఆర్టీసీ తీరు**

**నిర్మల్, సోన్ వద్ద వరుసగా నిలిచిపోయిన సర్వీసులు**

**సాంకేతిక లోపాలపై పెరుగుతున్న అనుమానాలు**

**ప్రయాణికుల భద్రత కంటే ప్రచారానికే పెద్దపీట అన్న విమర్శలు**

కాకతీయ, తెలంగాణ బ్యూరో : పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పుడు ప్రయాణికులకు కొత్త తలనొప్పిగా మారుతున్నాయి. కాలుష్యాన్ని తగ్గిస్తామని, ఆధునిక ప్రయాణ అనుభవం కల్పిస్తామని చెప్పిన ఈ బస్సులు తరచూ నడిరోడ్డుపైనే మొరాయిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇటీవల కరీంనగర్ జిల్లాలో ఎలక్ట్రిక్ బస్సులో జరిగిన అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు కారణమైనా... ఆ ఘటన నుంచి ఆర్టీసీ అధికారులు ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తనిఖీలు నిర్వహించామని ప్రకటించినా, వాస్తవ పరిస్థితుల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ డిపో నుంచి నిర్మల్ మీదుగా నడిచే ఎలక్ట్రిక్ బస్సులు తరచూ మార్గమధ్యంలోనే నిలిచిపోతుండటంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాపోతున్నారు.

### రోడ్డుమధ్యలోనే హ్యాండ్సప్

నిజామాబాద్ డిపో పరిధిలో నడిచే ఎలక్ట్రిక్ బస్సులు నిత్యం పదుల సంఖ్యలో నిర్మల్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ బస్సులు తరచూ మార్గమధ్యంలోనే సాంకేతిక లోపాలతో ఆగిపోతున్నాయి. గత వారం నిర్మల్ జిల్లా కేంద్రంలో భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ఓ ఎలక్ట్రిక్ బస్సు మున్సిపల్ ప్రధాన రహదారిపై ఒక్కసారిగా నిలిచిపోయింది. బస్సు రోడ్డుమధ్యలో ఆగిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వర్షంలోనూ, ఎండలోనూ ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. డ్రైవర్లు ఎంత ప్రయత్నించినా బస్సును మళ్లీ స్టార్ట్ చేయలేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు.

### హైవేపై రాత్రి వేళల్లో భయం

సోన్ మండలం సమీపంలోని జాతీయ రహదారి-44పై కూడా ఇలాంటి ఘటనే పునరావృతమైంది. రాత్రి వేళల్లో ప్రయాణికులతో వెళ్తున్న ఎలక్ట్రిక్ బస్సు ఒక్కసారిగా నిలిచిపోయింది. చీకటి సమయంలో హైవేపై బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సు సిబ్బంది సరైన సమాచారం ఇవ్వకపోవడంతో ప్రయాణికుల్లో మరింత ఆందోళన నెలకొంది. ప్రత్యామ్నాయ బస్సులు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమవడంతో చాలామంది సొంత ఖర్చులతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. తరచూ జరుగుతున్న ఘటనలతో ఎలక్ట్రిక్ బస్సుల నాణ్యత, నిర్వహణపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాంకేతిక లోపాలతో వాహనాలను రోడ్డెక్కిస్తున్నారనే విమర్శలు పెరుగుతున్నాయి. రోడ్డుపై వెళ్తుండగానే బ్యాటరీలు వేడెక్కడం, షార్ట్‌సర్క్యూట్‌లు, సాంకేతిక లోపాలు తలెత్తే అవకాశాలపై ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఉద్యోగాలు, కళాశాలలు, అత్యవసర పనుల కోసం ప్రయాణించే వారికి ఈ పరిస్థితి తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక విద్యార్థులు, ఉద్యోగులు నష్టపోతున్నారు. ప్రతి డిపోలో ప్రత్యేక సాంకేతిక నిపుణులను నియమించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు కేవలం తూతూ మంత్రంగానే జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. చిన్నపాటి లోపాలను సకాలంలో గుర్తించి సరిదిద్దడంలో యంత్రాంగం విఫలమవుతోందని ప్రయాణికులు చెబుతున్నారు.

### ప్రకటనలకే పరిమితమైన చర్యలు

ప్రమాదం జరిగిన ప్రతిసారీ అధికారులు తనిఖీలు నిర్వహించామని, సర్వీసులు సురక్షితమని ప్రకటిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి మాత్రం మారడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ డిపో అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించే పరిస్థితి లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రయాణికుల భద్రత కంటే సర్వీసుల నిర్వహణ, ఆదాయంపైనే దృష్టి పెట్టారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పర్యావరణ హిత రవాణాను ప్రజలు స్వాగతిస్తున్నప్పటికీ, అందుకు తగిన మౌలిక వసతులు, సమర్థవంతమైన నిర్వహణ లేకుండా ఎలక్ట్రిక్ బస్సులను రోడ్డెక్కించడం ప్రమాదకరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చార్జింగ్ స్టేషన్ల నిర్వహణలో లోపాలు, సాంకేతిక పర్యవేక్షణలో నిర్లక్ష్యం కూడా ఈ సమస్యలకు కారణమవుతున్నాయని తెలుస్తోంది. ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, తరచూ మొరాయిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులపై సమగ్ర సాంకేతిక తనిఖీలు నిర్వహించాలని, లోపభూయిష్ట వాహనాలను తక్షణమే సేవల నుంచి తప్పించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా కూడా ఈ సమస్యలపై నిరసనలు వెల్లువెత్తుతుండగా, ఇకనైనా ప్రభుత్వం స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## ఫీజుల దందాకు చెక్.. వివరాలు దాచితే చర్యలే

**ప్రైవేట్ పాఠశాల ఫీజులు బహిరంగంగా ప్రదర్శించాల్సిందే**

**ఫీజుల పారదర్శకతకు విద్యాశాఖ కొత్త ఆదేశాలు**

కాకతీయ,తెలంగాణ బ్యూరో : ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల వివరాలను దాచిపెట్టే పరిస్థితికి ఇక ముగింపు పలకాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన తరగతుల వారీ ఫీజులను ప్రతి పాఠశాల నోటీసు బోర్డు, పాఠశాల వెబ్‌సైట్‌తో పాటు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశాలు జారీ చేసింది. ఫీజుల నిర్ణయానికి సంబంధించిన గవర్నింగ్ బాడీ సభ్యుల సంతకాలతో కూడిన పత్రాలను కూడా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఫీజుల వివరాలను ప్రదర్శించని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. దీంతో ఫీజుల విషయంలో తల్లిదండ్రులకు పూర్తి పారదర్శకత ఏర్పడుతుందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12000 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, ప్రతి ఏడాది ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పెరిగిన ఫీజులతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ముసాయిదా బిల్లును సిద్ధం చేసింది. రెండేళ్లకోసారి 8 శాతం మేర ఫీజు పెంపునకు అవకాశం కల్పించే ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత చట్టం తీసుకురావాలని యోచిస్తోంది.

### 2027-28 నాటికి చట్టం

ఫీజు నియంత్రణపై ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రస్తుత ఫీజులు, ఆడిట్ నివేదికలు, ఇతర వివరాలను సేకరించాలని ఆదేశించినట్లు సమాచారం. ముసాయిదా బిల్లుపై ప్రజల అభిప్రాయాలు స్వీకరించి, మంత్రివర్గ ఆమోదం అనంతరం శాసనసభలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో 2027-28 విద్యా సంవత్సరం నాటికి ఫీజు నియంత్రణ చట్టం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

## విద్యుత్ ప్రమాదాల నివారణకు భద్రతే ప్రధానం

- ఏటూరునాగారం సబ్ డివిజన్ సిబ్బందికి ప్రత్యేక అవగాహన
- భద్రతా పరికరాల వినియోగంపై కచ్చితంగా దృష్టి
- ఏటూరునాగారం సబ్ డివిజన్ ఏడీఈ ఉమారావు




కాకతీయ, ఏటూరునాగారం, రూరల్: విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఏటూరునాగారం సబ్ డివిజన్ ఏడీఈ ఉమారావు సూచించారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో వెంకటాపురం, ఏటూరునాగారం ప్రాంతాల యూన్‌మ్యాన్‌లు, ఎమర్జెన్సీ బ్రేక్‌డౌన్ సిబ్బంది, స్పాట్ బిల్లర్లకు విద్యుత్ ప్రమాదాల నివారణ, భద్రతా పరికరాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమారావు మాట్లాడుతూ విధులు నిర్వహించే సమయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఇటీవల చోటుచేసుకుంటున్న విద్యుత్ ప్రమాదాల కారణాలను వివరించి, అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చన్నారు. కొత్తగా నియమితులైన ఎమర్జెన్సీ బ్రేక్‌డౌన్ సిబ్బందికి వోల్టేజ్ ఇండికేటర్లను అందజేశారు.

### భద్రతా పరికరాల వినియోగం తప్పనిసరి

ఏటూరునాగారం లైన్‌మెన్ రాజమల్లయ్య మాట్లాడుతూ యూన్‌మ్యాన్‌లు, ఎమర్జెన్సీ బ్రేక్‌డౌన్ సిబ్బంది విధుల సమయంలో ఎర్త్ డిశ్చార్జ్ రాడ్, సేఫ్టీ హెల్మెట్, సేఫ్టీ బెల్ట్, సేఫ్టీ జాకెట్ తదితర భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. భద్రతా పరికరాలను నిర్లక్ష్యం చేస్తే ఎదురయ్యే ప్రమాదాలను తన అనుభవాల ద్వారా వివరించి సిబ్బందికి అవగాహన కల్పించారు. విద్యుత్ పనుల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు సూచించారు.

## చేనేత దినోత్సవం సందర్భంగా
# రోగులకు పండ్లు పంపిణీ



కాకతీయ, ఏటూరునాగారం, రూరల్ : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటూరునాగారం మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సామాజిక ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం పద్మశాలి సంఘం సభ్యులు రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. చేనేత రంగం అభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పద్మశాలి సంఘం సభ్యులు ముందుండాలని అన్నారు. రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయంలో ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిప్ప అశోక్, పోగుల లక్ష్మీనారాయణ, అలువాల శ్రీనివాస్, కందగట్ల వేణు, కందగట్ల శ్రీనివాస్, లోటపేటల రాజేష్, నూతి ప్రణయ్, చెన్న రాంబాబు, శ్రీరామ్ సురేష్, ఇరుశావడ్ల నాగరాజు, కూరపాటి వేణుగోపాల్, చిరురాల గంగాధర్, కోడం కిరణ్, కోడం మురళి, గుండ్లపల్లి నాగరాజు, గుండ్లపల్లి సత్యం, చామర్తి కిషోర్, వావిలాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మురుగు నీరు పరుగేది?

## శివనగర్ లో శిథిలమైన మురుగు కాల్వలు





కాకతీయ ఫోకస్

- అండర్ బ్రిడ్జి సమీపంలో ధ్వంసమైన నాలా
- వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో సైడ్ కాల్వల్లో నిలిచిన మురుగునీరు ప్లాస్టిక్ బాటిళ్లతో నిండి, పాకురుపట్టిన కాల్వలు పట్టించుకోని వరంగల్ మహానగర పాలక సంస్థ

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : వరంగల్ నగరంలోని శివనగర్ లో మురుగునీటి కాల్వలు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. కొన్ని చోట్ల కాల్వలు ధ్వంసమయ్యాయి. మరికొన్ని చోట్ల మురుగునీటి కాల్వలు మూసుకుపోయి మురుగునీరు కాల్వల్లోనే నిలిచిపోయి మురికి కుంటలను తలపిస్తున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న డ్రెయినేజీ నాలాలతో శివనగర్ స్లమ్ ఏరియాలా మారిపోయింది. మురుగు నీరు ముందుకు కదిలే అవకాశం లేకుండా ప్లాస్టిక్ బాటిళ్ల నిండుకుని, పాకురు పట్టి అసహ్యంగా కనిపిస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణం మధ్య ప్రజలు జీవించాల్సిన దుస్థితి నెలకొంది.

### మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మొద్దునిద్ర!

అసలే వర్షాకాలం.. పైగా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారిన వరంగల్ నగరంలో మురికి నీటి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారా? లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. నగరంలో పారిశుధ్య నిర్వహణ తీరును పర్యవేక్షించాల్సిన అధికారులు మొద్దునిద్రలో ఉన్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వానాకాలంలో అపరిశుభ్ర వాతావరణంతో రోగాలు ప్రబలుతాయన్న విషయాన్ని అధికారులు విస్మరించారా? అంటూ ప్రజలు మండిపడుతున్నారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఏరియా పెద్దనాలా ఒకవైపు కూలిపోతున్నా.. అధికారులు కనిపెట్టారా? లేదా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. శివనగర్ ఏరియా వరంగల్ రైల్వే స్టేషన్ కు సమీపంలోని కాలనీల్లో మురికి నీటి కాల్వల్లో ప్రవాహం లేకుండా మురికి కూపాలను తలపిస్తున్నాయి. డ్రెయినేజీ కాల్వల నిండా ప్లాస్టిక్ బాటిళ్లు, డిస్పోజల్ గ్లాసులు కనిపిస్తున్నాయి. కాల్వల్లో నీటి ప్రవాహం నిలిచిపోవడంతో పాకురు పట్టి అధ్వానంగా తయారయ్యాయి. అసలు ఇక్కడ మురికి కాల్వలు పూర్తిగా ధ్వంసమైనట్లు పరిస్థితులు కళ్లకు కడుతున్నాయి. అయినా, వరంగల్ బల్దియా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నగరం పుట్టినప్పుడు ఏర్పడిన శివనగర్ లో పరిస్థితులు ఇలా ఉంటే.. శివారు ప్రాంతాలు, కొత్తగా ఏర్పడిన కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ ఏమేర ఉంటుందో అర్థమవుతోంది.





### ఎందుకింత నిర్లక్ష్యం?

వరంగల్ మహానగర పాలక సంస్థ పారిశుధ్య విభాగంలో సుమారు 3వేల పై చిలుకు మందికి పైగా సిబ్బంది ఉన్నట్లు సమాచారం. అందులో వరంగల్ తూర్పులో 13, 14 వందల మంది పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. మరి వీరంతా కేవలం అండర్ బ్రిడ్జి ఇవతలి ప్రాంతానికే సరిపోతున్నారా? లేదంటే ఈ ప్రాంతంలోనే అందరికీ విధులు వేస్తున్నారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. శివనగర్ ఏరియాపై బల్దియా అధికారులు కావాలనే చిన్నచూపు చూస్తున్నారా? అనే ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. ఇప్పటికైనా బల్దియా అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి శివనగర్ ఏరియాలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తారా? లేదా? వేచిచూడాలి.

# నెల్లికుదురు, ఇనుగుర్తి కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం



నెల్లికుదురు మండల అధ్యక్షులు యాదవ రెడ్డి



ఇనుగుర్తి మండల అధ్యక్షులు బైరు అశోక్ గౌడ్

కాకతీయ, నెల్లికుదురు/ఇనుగుర్తి: మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భూక్య ఉమా మురళి నాయక్ జిల్లాలోని పలు మండలాలకు కొత్త అధ్యక్షులను నియమించారు. ఇందులో భాగంగా నెల్లికుదురు మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎదల్ల యాదవ రెడ్డి, ఇనుగుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బైరు అశోక్ గౌడ్ నియమితులయ్యారు. నూతన అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తూ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన డీసీసీ అధ్యక్షుడు భూక్య ఉమా మురళి నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# మంత్రి జిల్లాలోనే విద్యార్థుల సమస్యలు

- హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు





కాకతీయ, ములుగు ప్రతినిధి: మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు జిల్లాలోనే ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యల నిలయాలుగా మారాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన విద్యార్థుల పాదయాత్ర ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ, ములుగు కేంద్రంలో ఇప్పటికీ ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వ కళాశాల హాస్టల్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, బోధనా సిబ్బంది వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 28వ వారానికి చేరిన సర్వోదయ చరక అభ్యాస



కాకతీయ, హనుమకొండ : గాంధేయ సిద్ధాంతాల ప్రచారం, స్వయం సమృద్ధి లక్ష్యంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వోదయ చరక అభ్యాస కార్యక్రమం విజయవంతంగా 28వ వారానికి చేరుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొని చరకాతో నూలు వడికారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ ఆశయాలు, స్వదేశీ భావనను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గత 28 వారాలుగా కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆయన అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ గాంధేయవాదానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. చరకా కేవలం ఒక సాధనం మాత్రమే కాదని, అది స్వయం ఉపాధికి, ఆత్మగౌరవానికి, స్వదేశీ స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. నేటి యువతకు మహాత్మా గాంధీ సిద్ధాంతాలను చేరువ చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళి రెడ్డి, గ్రేన్ మార్కెట్ చైర్‌పర్సన్ పులి ప్రియాంక అనిల్, రాష్ట్ర ఎస్సీ విభాగం వైస్ చైర్‌పర్సన్ గోవిందు శ్వేత, డీసీసీ జిల్లా కమిటీ సభ్యులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# క్షయను తొలి దశలోనే గుర్తించాలి

- ప్రతి కేసును నిక్షయ్ పోర్టల్‌లో నమోదు చేయాలి
- సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : పిల్లల్లో క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి వెంటనే చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పిల్లల క్షయవ్యాధి సమగ్ర నిర్వహణపై జిల్లా స్థాయి పునశ్చరణ శిక్షణ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, నిర్ధారణ అయిన ప్రతి క్షయ కేసును నిక్షయ్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసి వెంటనే చికిత్స ప్రారంభించాలని సూచించారు. టెక్నాలజీ ఆధారిత యాక్టివ్ కేస్ ఫైండింగ్ ద్వారా అధిక ప్రమాదంలో ఉన్న పిల్లలను గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు కూడా క్షయ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసి క్షయ రహిత భారతదేశ లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పీహెచ్‌సీలు, పల్లె దవాఖానల వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీజనల్ వ్యాధుల నివారణ చర్యలను వేగవంతం చేయాలని, ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శిక్షణలో పిల్లల్లో క్షయవ్యాధి లక్షణాలు, నిర్ధారణ, చికిత్స, కాంటాక్ట్ ట్రేసింగ్, నిక్షయ్ పోర్టల్ వినియోగంపై నిపుణులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా. రాజమౌళి, డా. సాజిదా, డా. ఇక్తిదార్ అహ్మద్, డా. రవీందర్, డా. శైలజ, డా. ఎస్తేర్ బ్లెస్సీ, హెప్సీబా, గుండె సురేందర్, మణి తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 16న జిల్లాకు ముఖ్యమంత్రి రాక





- అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలి...
- పంచాయతీ రాజ్ హమ్ రోడ్ల పనులకు ఇక్కడి నుండే శ్రీకారం....
- నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం...

కాకతీయ, ములుగు ప్రతినిధి: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న పంచాయతీ రాజ్ హమ్ రోడ్ల పనుల కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఇక్కడి నుండే శ్రీకారం చుట్ట నున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రానున్న సందర్భంగా మంత్రి సీతక్క శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవురావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనాలతో కలిసి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి హైదరాబాదు నుండి నేరుగా మేడారం చేరుకొని వన దేవతలను దర్శించుకొని, అనంతరం ములుగు చేరుకొని పైలాన్ ప్రారంభించడమే కాకుండా ములుగు మండలం ఇంచర్ల గ్రామ శివారులో ఏడు కోట్ల రూపాయలతో నిర్మించిన ఇందిరమ్మ మహిళా శక్తి భవనాన్ని వర్చువల్, నూతన కలెక్టరేట్ సముదాయ భవనాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. జిల్లా లో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న అభివృద్ధి పనుల వివరాల జాబితాను అన్ని శాఖల అధికారులు ఈ నెల 10వ తేదీ వరకు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ ఈ నెల 12న వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. మేడారం పరిసర ప్రాంతాల్లో రహదారులు ఆక్రమించిన వ్యాపారాలు చేస్తున్న వారికి జరిమానా విధించాలని, వ్యాపారాలు ఏర్పాటు చేయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, ఎస్ డి సి ప్రతాప్, డిప్యూటీ ట్రేని కలెక్టర్ కుషిల్ వంశీ, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని

# ఉపాధ్యాయుల నిరసన



కాకతీయ, నెల్లికుదురు: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ యూఎస్‌పీసీ (ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ) పిలుపు మేరకు శుక్రవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం రెండున్నరేళ్లు గడిచినా పీఆర్సీ, డీఏలపై నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సీపీఎస్ రద్దుతో పాటు పీఆర్సీ, పెండింగ్ డీఏలు ప్రకటించే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. పద్మావతి,హరినాథ్,సుకన్య,మమత,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్లకే తొలి ప్రాధాన్యం

- 60% నామినేటెడ్ పదవులు వారికే
- కష్టకాలంలో పార్టీని నిలబెట్టిన కార్యకర్తలకు న్యాయం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు తగిన ప్రాధాన్యం
- వర్ధన్నపేట పరిధిలో 1, 65, 66 డివిజన్లకు ప్రత్యేక ఇంచార్జ్‌ల నియామకం
- పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేస్తాం
- హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

కాకతీయ, హనుమకొండ : ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా కీలక మలుపు అవుతాయని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకుని కష్టకాలంలోనూ కాంగ్రెస్ జెండాను మోసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలకు రానున్న నామినేటెడ్ పదవుల్లో 60 శాతం ప్రాధాన్యం కల్పించాలని అధిష్ఠానం నిర్ణయించడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. మాజీ మండల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, నియోజకవర్గ సీనియర్ నాయకులకు ప్యాక్స్ డైరెక్టర్లు, చైర్మన్లు, మార్కెట్ కమిటీలు తదితర నామినేటెడ్ పదవుల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా నిజమైన పార్టీ కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించడం కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయంపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.

### సమన్వయంతోనే తుది జాబితా

ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్ మంత్రులు, స్థానిక మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ అభ్యర్థులు, సీనియర్ నాయకులతో సమన్వయం చేసుకుని ఆశావహుల తుది జాబితా రూపొందించేలా అధిష్ఠానం స్పష్టమైన విధివిధానాలు రూపొందించిందన్నారు. క్షేత్రస్థాయి కార్యకర్తల త్యాగాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్న ఏఐసీసీ ప్రతినిధి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లకు జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

### డివిజన్ కమిటీల ఏర్పాటుకు ప్రత్యేక ఇంచార్జ్‌లు

టీపీసీసీ ఆదేశాల మేరకు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 1, 65, 66 డివిజన్లలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు ప్రత్యేక ఇంచార్జ్‌లను నియమించినట్లు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రకటించారు. ఈ బాధ్యతలను డీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, డీసీసీ జనరల్ సెక్రటరీలు బిన్ని లక్ష్మణ్, మారంరెడ్డి కౌశిల్ రెడ్డి, డీసీసీ సెక్రటరీలు కట్ట రఘుపాల్ రెడ్డి, ముక్కెర సురేష్, కొక్కిరాల స్వాతి, డీసీసీ ఈసీ సభ్యుడు కొత్త వాసుదేవ రెడ్డికి అప్పగించినట్లు తెలిపారు. నియమితులైన ఇంచార్జ్‌లు వెంటనే క్షేత్రస్థాయిలో పనిచేస్తూ స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుని నిర్దేశిత గడువులోగా డివిజన్ కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని సూచించారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, సీనియర్ నాయకులకు తగిన గౌరవం కల్పించడం అనే రెండు లక్ష్యాలతో కాంగ్రెస్ అధిష్ఠానం ముందుకు సాగుతోందని, ఈ నిర్ణయాలు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపి పార్టీని మరింత శక్తివంతం చేస్తాయని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.



# నేతన్నలకు పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**ఇందిరా మహిళా శక్తి చీరలతో ఉపాధి**
**త్రిఫ్ట్, బీమా పథకాలతో కార్మిక కుటుంబాలకు భరోసా**
**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
**రాజన్న సిరిసిల్లలో జాతీయ చేనేత దినోత్సవం**



కాకతీయ సిరిసిల్ల టౌన్ : నేతన్నలకు చేతినిండా పని కల్పించి, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కోర్టు నుంచి పాత బస్ స్టాండ్ వద్ద ఉన్న నేతన్న విగ్రహం వరకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంబించి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,చేనేత, వస్త్ర పరిశ్రమ కార్మికులతో కలిసి భారీ ర్యాలీ తీసి నేతన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిరిసిల్ల చేనేత, వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు.సిరిసిల్లలోని నేతన్నలు, కార్మికులు, ఆసాములు, యజమానులకు సంవత్సరంలో సుమారు ఎనిమిది నెలల పాటు పని కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత సంవత్సరం 6 కోట్ల 70 లక్షలకు పైగా మీటర్ల ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 4 కోట్ల 50 లక్షల మీటర్ల ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. త్వరలో మరో కోటి 50 లక్షలకు పైగా మీటర్లకు ఆర్డర్లు ఇచ్చే అవకాశం ఉందని,అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు, ఇతర అవసరాలకు సంబంధించిన వస్త్రాల ఉత్పత్తి ద్వారా కూడా స్థానిక నేతన్నలకు పని కల్పిస్తున్నామన్నారు.సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన రూ.400 కోట్లకు పైగా బకాయిలలో రూ.350 కోట్లకు పైగా చెల్లించి నేతన్నలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించిన చీరల బిల్లుల్లో 80 శాతం చెల్లించామని, మిగిలిన 20 శాతం కూడా త్వరలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేతన్నల సంక్షేమం కోసం త్రిఫ్ట్ పథకం ద్వారా కార్మికుల పొదుపునకు ప్రభుత్వం సమానంగా చేయూతనిస్తోందన్నారు. నేతన్నల బీమా పథకం ద్వారా ఇప్పటివరకు సిరిసిల్లలో 129 మందికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులకు రూ.25 కోట్ల మేర రుణమాఫీ చేయడంతో పాటు లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేసినట్లు పేర్కొన్నారు. పవర్‌లూమ్ పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ 25 హెచ్‌పీ వరకు పవర్ లూమ్‌లకు యూనిట్‌కు రూ.2 సబ్సిడీ అమలు చేయడం వల్ల మూత పడిన అనేక పవర్‌లూమ్‌లు తిరిగి ప్రారంభమయ్యాయని తెలిపారు. దీంతో యజమానులు, ఆసాములు, కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరిగాయని అన్నారు..చేనేతకు ప్రసిద్ధి చెందిన సిరిసిల్ల జిల్లాలో నేతన్నలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, రైతన్నలు, నేతన్నలు సహా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఆర్డీఓ శ్రీధర్ బాబు, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సంతోష్, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, చేనేత, వస్త్ర పరిశ్రమ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాలలో విషాదం..

- మాజీ జడ్పీటీసీ సుంకరి సరిత గౌడ్ కన్నుమూత
- అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- ప్రజాసేవతో గుర్తింపు తెచ్చుకున్న నాయకురాలికి నివాళులు



కాకతీయ, చేర్యాల : బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, చేర్యాల మాజీ జడ్పీ టీసీ సుంకరి సరిత గౌడ్ శుక్రవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆమె మృతితో చేర్యాల ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జడ్పీటీసీగా పనిచేసిన కాలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకురాలిగా సరిత గౌడ్ గుర్తింపు పొందారు. ప్రజాసేవలో ఆమె చూపిన నిబద్ధతను పలువురు స్మరించుకున్నారు. సరిత గౌడ్‌కు భర్తతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు చదువుకుంటున్న సమయంలోనే తల్లి మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె మృతిపట్ల రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కొత్త పెన్షన్ నిబంధనలపై బీజేపీ ఆందోళన

- కరీంనగర్-వరంగల్ రహదారిపై బైఠాయింపు
- అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్



కాకతీయ, శంకరపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెన్షన్ అర్హత నిబంధనలను సవరించి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం శంకరపట్నంలో ఆందోళన నిర్వహించారు. కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపిన నాయకులు అనంతరం కొత్త నిబంధనల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ మాట్లాడుతూ వృద్ధాప్య పెన్షన్‌కు 70 ఏళ్ల వయోపరిమితి విధించడం అన్యాయమన్నారు. అర్హత వయస్సును 57 ఏళ్లకు తగ్గించాలని, వితంతు మహిళలకు వయోపరిమితి లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు.బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో బోనాలు వేడుకల ప్రదర్శన



కాకతీయ, చందుర్తి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల పండుగను చందుర్తి మండలం తిమ్మాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పోతురాజు వేషధారణ, జానపద నృత్యాలు, ఊరేగింపు ఆకట్టుకున్నాయి. గ్రామ సర్పంచ్ కాపిల్ల శంకర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నారులు సంప్రదాయాలను పరిరక్షించాలని సూచించారు. ఉపసర్పంచ్ ఏడ్ల హరీష్ విద్యతో పాటు సాంస్కృతిక విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు మోరే కుమార్, బి. రమ్య, అంగన్‌వాడీ టీచర్ గంగజల, ఆయా సరిత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వార్డు సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

- దలారులకు విక్రయిస్తే కఠిన చర్యలు
- కరీంనగర్ రూరల్ పోలీసుల హెచ్చరిక



కాకతీయ, కరీంనగర్ : పేదలకు ప్రభుత్వం ఉచితంగా అందించే ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ చేయడం, విక్రయించడం చట్టవిరుద్ధమని కరీంనగర్ రూరల్ పోలీసులు హెచ్చరించారు. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు దుబ్బపల్లి గ్రామంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శిరిగిరి సాగర్ నివాసంలో ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ ఉంచిన సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకోగానే పరారయ్యేందుకు ప్రయత్నించిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో పేదల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి, ఇంటి వద్ద నిల్వ ఉంచి సమీపంలోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులు, పౌల్ట్రీ ఫార్ములకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి ఇంట్లో 37 సంచుల్లో నిల్వ ఉంచిన బియ్యాన్ని పంచాయతీదారుల సమక్షంలో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించే చర్యలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి చర్యల కోసం సివిల్ సప్లై శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పేదలకు అందించే బియ్యాన్ని దలారులకు విక్రయించవద్దని ప్రజలకు సూచిస్తూ, అక్రమాలకు పాల్పడే వారిపై పీడీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

### హుజూరాబాద్‌లో రాజకీయ వివాదం..

## మోదీ ఫ్లెక్సీ ఘటనపై ఫిర్యాదు

కాకతీయ, కరీంనగర్/ హుజూరాబాద్ : హుజూరాబాద్ బస్టాండ్ కార్నర్‌లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారానికి ఏర్పాటు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ ఫ్లెక్సీపై గుర్తుతెలియని వ్యక్తులు అభ్యంతరకర స్టిక్కర్లు అంటించారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు హుజూరాబాద్ టౌన్ సీఐకి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో, ఫ్లెక్సీపై "విద్యార్థుల రక్తం మోదీ చేతుల్లో" అనే వాక్యంతో పాటు ఏకే–47 తుపాకుల చిత్రాలు ఉన్న స్టిక్కర్లను ప్రధాని చిత్రంపై అంటించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి, బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ప్రజా ఆస్తులు, రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## దళితుల ఇళ్ల కూల్చివేత నిలిపివేయాలి

**చేర్యాల మున్సిపల్ కమిషనర్‌కు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశం**

కాకతీయ, చేర్యాల: చేర్యాల పట్టణంలో రోడ్డు విస్తరణ పేరుతో దళితుల ఇళ్లను కూల్చివేయాలనే ప్రతిపాదనలను విరమించుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించింది. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ ఆధ్వర్యంలో బాధితులు హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన కమిషన్ సభ్యుడు జిల్లా శంకర్ చేర్యాల మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దళితుల ఇళ్ల కూల్చివేతకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించారు. దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ ప్రస్తుతం ఇళ్ల కూల్చివేతకు సంబంధించిన ప్రతిపాదనలు లేవని, దళితుల ఇళ్లను కూల్చివేయబోమని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. కార్యక్రమంలో గుస్క వెంకటేశం, అంజయ్య, గునిగంటి శివ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో విధులకే గైర్హాజరా..?

- ఆఫీస్ వేళల్లో క్యాంటీన్లలో సిబ్బంది మకాం
- జిల్లా అధికారులు జోక్యం చేసుకోవాలనిప్రజల విజ్ఞప్తి



కాకతీయ, మయూరి సెంటర్: ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సత్వర సేవలు అందించాల్సిన ఉద్యోగులే విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖలో కొందరు సిబ్బంది డెస్కుల వద్ద అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రతిరోజూ వివిధ సమస్యల పరిష్కారం కోసం వందలాది మంది కలెక్టరేట్‌కు వస్తున్నప్పటికీ, సంబంధిత ఉద్యోగులు కార్యాలయ సమయంలో డెస్కుల వద్ద కాకుండా ఇందిరా మహిళా క్యాంటీన్ పరిసరాల్లో గడుపుతున్నారని, మరికొందరు గంటల తరబడి సెల్‌ఫోన్లలోనే నిమగ్నమై ఉంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ఫైళ్ల పరిశీలన, సంతకాలు, ధ్రువపత్రాల జారీ, ఫిర్యాదుల స్వీకరణ వంటి పనులు ఆలస్యమవుతున్నాయని బాధితులు వాపోతున్నారు.

### వేచి చూసి వెనుదిరుగుతున్న ప్రజలు

అత్యవసర పనులతో వచ్చిన వారికీ సంబంధిత అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు. "సార్ లేరు.. కాసేపట్లో వస్తారు" అనే సమాధానం తప్ప స్పష్టమైన సమాచారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాల్లో హాజరు, విధుల నిర్వహణపై ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేపట్టి, ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సైదాపూర్ మార్కెట్ యార్డు అభివృద్ధికి శ్రీకారం

- రూ.1.80 కోట్ల పనులకు మంత్రి పొన్నం శంకుస్థాపన
- ప్రతి గ్రామంలో సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తామని హామీ



కాకతీయ, కరీంనగర్: సైదాపూర్ మండలం వెంకేపల్లిలో రూ.1.80 కోట్లతో వ్యవసాయ మార్కెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.1.50 కోట్లతో నూతన మార్కెట్ భవనం, రూ.30 లక్షలతో 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణ పనులను ప్రారం భించి, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఐదు ఎకరాల భూమి కేటాయిస్తే ప్రతి గ్రామంలో సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, వర్షపు నీటి సంరక్షణకు ఇంకుడు గుంత లు, ఇంజెక్షన్ బోర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధా కర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## మట్టి మాఫియా వెనుక ఎవరున్నారు..?

- మెడికల్ కళాశాల భూమిలో డోలమైట్ విక్రయాలు..:
- ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ బాబా
- రఘునాథపాలెంలో అక్రమ తవ్వకాలపై ఐయూఎంఎల్ తీవ్ర ఆరోపణలు




కాకతీయ, రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలో జరుగుతున్న మట్టి మాఫియాపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ జిల్లా అధ్యక్షులు షేక్ బాజీ బాబా డిమాండ్ చేశారు. రఘునాథపాలెంలో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు, ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ జిల్లా కమిటీ బృందం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మట్టి మాఫియాపై తీవ్ర విమర్శలు చేసిన ప్రస్తుత పాలకులు, ఇప్పుడు రెండేళ్లుగా కొనసాగుతున్న అక్రమ తవ్వకాలపై ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. మట్టి మాఫియాను ప్రోత్సహిస్తున్నది ఎవరో, వారికి అధికార పార్టీ నాయకులు, మైనింగ్ అధికారులతో ఉన్న సంబంధాలేమిటో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

**అధికారులపై ఒత్తిళ్లున్నాయా..?**

మెడికల్ కళాశాల నిర్మాణం చివరి దశకు చేరుకున్నప్పటికీ భూమి చదును పేరుతో కోట్ల రూపాయల విలువైన మట్టిని విక్రయిస్తున్నారని, అదే స్థలంలో ఉన్న డోలమైట్ ఖనిజాన్ని కూడా తరలించారని షేక్ బాజీ బాబా ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు జిల్లా మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, అధికార పార్టీ నుంచి ఒత్తిళ్లు ఉన్నాయని వారు చెబుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఒక లారీ మట్టి రూ.2000 ఉండగా ప్రస్తుతం రూ.6000కు చేరిందని, మట్టి ధర పెరిగిందా, లేక లంచాల రేటు పెరిగిందా అనే అనుమానాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోకపోతే ప్రజల మద్దతుతో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## ఎమ్మార్వో కార్యాలయంలోనే మద్యం మజిలీ..!

**పనివేళల్లోనే ఆవరణలో మందుబాబుల హల్‌చల్**
**భద్రతపై ప్రశ్నలు.. చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**



కాకతీయ, మయూరి సెంటర్ : ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ కార్యాలయమే మందుబాబులకు అడ్డాగా మారిన ఘటన ఖమ్మం అర్బన్ ఎమ్మార్వో కార్యాలయంలో వెలుగు చూసింది. కార్యాలయ పనివేళల్లోనే కొందరు వ్యక్తులు ఆవరణలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న దృశ్యాలు కలకలం రేపుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు "కాకతీయ" నిఘా కెమెరాలో నమోదయ్యాయి. పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన మహిళలు, వృద్ధులు, ప్రజలు ఈ దృశ్యాలను చూసి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలోనే మద్యం సేవిస్తుంటే భద్రతా సిబ్బంది, అధికారులు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. కార్యాలయాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ప్రజల్లో అసురక్షిత భావనకు దారితీస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ ఇలాంటి ఘటనలు జరుగుతుండటం పర్యవేక్షణ లోపాన్ని బట్టబయలు చేస్తోందని అంటున్నారు. కార్యాలయ ఆవరణలో పటిష్ట భద్రత కల్పించాలని, పనివేళల అనంతరం కూడా సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణం లో మద్యం సేవించిన వారిని గుర్తించి పోలీసు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.